క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని కొండాపురం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండలం కొండాయి, చింతలపాడు గ్రామాలకు చెందిన తాటి లక్ష్మణ్, మడకం యర్రయ్యలు ద్విచక్ర వాహనంపై చర్ల మండలం నుంచి వెంకటాపురం మీదుగా కొండాయికి వస్తున్నారు. ఈ క్రమంలో కొండాపురం గ్రామ సమీపంలో ద్విచక్రవాహన వేగాన్ని అదుపు చేయలేక పల్టీ కొట్టడంతో లక్ష్మయ్య, యర్రయ్యలకు రెండు కాళ్లు విరిగి పోయాయాని తెలిపారు. గమనించిన గ్రామస్తులు 108కు సమాచారం అందించి వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కమిటీ ఎన్నిక



మహదేవపూర్: మండలంలోని ఎడపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడిగా కమ్మం చిన్నమల్లయ్య, ఉపాధ్యక్షుడిగా సమ్మయ్య, గౌరవ అధ్యక్షుడిగా చిన్నలక్ష్మయ్య, శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, సంయుక్త కార్యదర్శిగా సాంబయ్య, ప్రచార కార్యదర్శిగా రాజమౌళి, కోశాధికారిగా గట్టయ్య, శ్యామ్, కార్యదర్శిగా మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, జక్కయ్య, రాజ్‌కుమార్, పోశయ్యలను ఎన్నుకున్నారు.

నియామకం



మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మహిళ గ్రామ కమిటీని మండల అధ్యక్షురాలు కొండ రాజమ్మ ఆధ్వర్యంలో బుధవారం నియమించారు. అధ్యక్షురాలిగా ఎడ్ల పోషక్క, ఉపాధ్యక్షురాలిగా వేల్పుల కమల, సంయుక్త కార్యదర్శిగా మంచినీళ్ల పోశక్క, కోశాధికారిగా మెట్టు రమ, సలహాదారురాలిగా బొడ ఎల్లమ్మ, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శనిగారపు రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడిగా కుమారస్వామి



భూపాలపల్లి అర్బన్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నడిగొట్టి కుమారస్వామిని నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతం చేస్తూ గ్రామాల్లో బీసీలను ఐక్యం చేసి రాబోయే ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించాలని కుమారస్వామిని నియమించినట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు విజయ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి కాలయాపన చేయడం దారుణమన్నారు. రానున్న రోజుల్లో ఎస్సీ వర్గీకరణపై కేంద్రం వైఖరిని నిలదీసేందుకు జిల్లా కేంద్రంలో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దోర్నాల భరత్, రేనుకుంట్ల లడ్డు, బొడికల శ్రీకాంత్, నవీన్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

డెయిలీవేజ్ వర్కర్ల వేతనాలు పెంచాలి



ఐటీడీఏ పీఓ అంకిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

ఏటూరునాగారం: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డెయిలీవేజ్ వర్కర్ల వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఐటీడీఏపీఓ అంకిత్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేతనాలు పెంచాలని కలెక్టర్ గెజిట్ వచ్చినప్పటికీ దానిని అమలు చేయడం లేదన్నారు. గెజిట్ విడుదల అయిన నాటి నుంచి ఏరియర్స్ చెల్లించాలన్నారు. కార్మికుల కష్టాలు అర్థం చేసుకొని గెజిట్ అమలు చేయాలన్నారు. అలాగే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సాయిబాబు, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, జయలక్ష్మి, కమల, సంతోష, గున్నమ్మ ఉన్నారు.

రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం తాకట్టు



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

ములుగు రూరల్: రాష్ట్ర ప్రజలను ముప్పుతిప్పలు పెట్టి నిరంకుశ పాలన చేపట్టిన నిజాం వారసులకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేపట్టడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచినట్లు అవుతుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలో పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిజాం నిరంకుశ పాలనను కొనసాగిస్తున్నారని అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. లిక్కర్ స్కాంలో ఆరోపనలు ఎదుర్కొంటున్న ఆప్ పార్టీతో చేతులు కలిపి జాతీయ పార్టీ ఏర్పాటు చేసుకొని తప్పును కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలనకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, కృష్ణ, దేవేందర్‌రావు, బలరాం, తాటి కృష్ణ, భూక్య రాజునాయక్, రవీంద్రాచారి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య, తదితరులు

ములుగు: అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సలహాదారుడు కేతిరి క్రాంతి, జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతి, కళాకారుల సంఘం అధ్యక్షుడు పోరిక శ్యామల్ నాయక్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు నెమలి నర్సయ్య, బీజేపీ నాయకుడు తాటి కృష్ణ, మరాఠి రవీందర్, జన్ను రవి, తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సభ్యులు

వాజేడు: మండల పరిధిలోని బిజినేపల్లి గ్రామంలోని పేద గిరిజనులకు సుకోత్ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం మొరుమూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్, చర్చి పాస్టర్ శ్యామ్ చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుకోత్ సేవా సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రామకృష్ణ సేవా ట్రస్టు



నగదు, బియ్యం అందజేస్తున్న నాగరమేశ్

మంగపేట: జిల్లాలోని నిరుపేదలు, ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు శ్రీ రామకష్ణ సేవా ట్రస్టు అండగా ఉంటుందని ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేశ్ అన్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన రాచకొండ సమ్మయ్య అనే నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బుధవారం నాగ రమేశ్ పరామర్శించి రూ.3000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. అదే విధంగా వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీనర్సాపురానికి చెందిన మడకం నాగమ్మ, కృష్ణ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబలను పరామర్శించారు. ఒక్కో బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, రూ.1500 నగదు అందజేశారు. ఈ సందర్భంగా నాగరమేశ్ మాట్లాడుతూ నిరుపేదలకు సేవలు అందించాలన్న తలంపుతో సేవా ట్రస్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్‌చైర్మన్ బాడిష నవీన్, సభ్యులు కొమరం నితిన్, మహేష్, రాజశేఖర్, ఆదినారాయణ, శ్రీకాంత్, కిశోర్, సాయి, రమేష్ పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన నాయకులు



కొబ్బరికాయ కొడుతున్న జెడ్పీటీసీ రమణ

వెంకటాపురం(కె): ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు బుధవారం వెంకటాపురం మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, కార్యదర్శి పిల్లారి శెట్టి మురళి నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. బహిరంగ సభకు బయలుదేరిన బస్సులను జెడ్పీటీసీ పాయం రమణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామోదర్, శివాజి, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామ పంచాయతీలో సర్పంచ్ సమ్మక్క అధ్యక్షతన రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో బుధవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంటి నాగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అర్చన

టేకుమట్ల(రేగొండ): విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని రేగొండ మండలంలోని రేపాక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి భూపతి అర్చన అన్నారు. బుధవారం ఆమె జన్మదినం సందర్భంగా పాఠశాలలో స్టడీ మెటీరియల్‌ని అందజేశాసి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పట్టా పొందిన పూర్వ విద్యార్థి భూపతి అర్చనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు చరణ్‌సింగ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భిక్షపతి, రవీందర్, ముస్తాక్, సాంబరెడ్డి, రాజేశ్వర్, ప్రతాప్, సుభాషిని, స్వరూప, స్థానిక ఎంపీటీసీ వెంగళ సుజాతనర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలని వినతి



రేంజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని మల్లారం శివారులోని మానేరు ప్రాతంలో చెక్ డ్యాం పనులకు అక్రమంగా అటవీ ప్రాతం నుంచి మట్టి, బండరాలను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు కొయ్యూరు రేంజ్ కార్యాలయంలో రేంజర్ కిరణ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిషన్ భగీథ పనుల్లో భాగంగా అటవీ ప్రాంతమైన కొయ్యూరు నాగులమ్మ నుంచి మల్లారం మిషన్ భగీథ ట్యాంక్ వరకు జేసీబీతో పనులు చేపట్టారని పేర్కొన్నారు. దీంట్లో భాగంగా బయటికి వచ్చిన బండలతో పాటు అటవీ ప్రాతంలో మట్టిని సైతం చెక్ డ్యాం పనులకు వాహనాల ద్వారా ఎలాంటి అనుమతలు లేకుండా గుత్తేదారు తరలించినట్లు వినతి పేర్కొన్నట్లు తెలిపారు. అక్రంగా మట్టి, బండరాల్లను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

వెంకటాపురం(కె): ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిబోయిన సర్వేశ్వరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆదివాసీ చట్టాలు అమలకు నోచుకోవటం లేదని అన్నారు. ఇప్పటికైన అధికారులు ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకలు చింత సోమరాజు, చిరంజీవి, వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

రైతు నిరసన దీక్షకు తరలిరావాలి

కాటారం: కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌తో నష్టపోతున్న రైతులు, భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు(గురువారం) జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల పక్షాన చేపట్టే నిరసన దీక్షకు ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు హాజరవుతారని పేర్కొన్నారు. కాళేశ్వరం–మేడిగడ్డ ముంపు ప్రాంత రైతులు, గుండ్రాత్‌పల్లి, గంగపురి, మల్లారం, దామెరకుంట, లక్ష్మీపూర్, విలాసాగర్ మంపు రైతులు, భూ నిర్వాసితులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్‌గడ్డలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ.. ఎస్ఎస్‌యూఐ నాయకులు మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్ అవినాష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ మాట్లాడుతూ.. ఎటువంటి పట్టాలు లేకుండా విచ్చలవిడిగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, వారి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలకు కుల్చివేసి అర్హులైన నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



చిట్యాల: ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



మహాముత్తారం మండలం మీనాజీపేటలో..

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ శైలజ, ఎంపీడీఓ రామయ్య కోరారు. మండలంలోని ఒడితల ప్రాథమిక పాఠశాలలో, అలాగే వరికొల్ పల్లి గ్రామ శివారు కుమ్మరిపల్లి పాఠశాలలో కంటి వెలుగు శిబిరం నిర్వహణపై చేస్తున్న ఏర్పాట్లను బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు అర్థమయ్యే విధంగా కంటి వెలుగుపై కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. నేటి(గురువారం) నుంచి ప్రారంభం కానున్న కంటివెలుగు కార్యక్రమంలో ప్రజలు పాల్గొని ఉచితంగా కంటి అద్దాలు, మందులు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ఏర్పాట్ల పరిశీలన

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ కంటివెలుగు 2వ విడత కార్యక్రమంలో భాగంగా గురువారం(నేడు) నిర్వహించనున్న కార్యక్రమానికి అధికారులు మండలంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రెండు కేంద్రాల్లో సుమారు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో భాగంగా బుధవారం మండలకేంద్రంతో పాటు మీనాజీపేటలో ఏర్పాటు చేసిన వసతులను మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ కార్య వైద్య సిబ్బంది ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

మహదేవపూర్: మండలంలోని మహదేవపూర్, అంబటిపల్లి గ్రామపంచాయతీ, గ్రామపంచాయతీలలో నేటి (గురువారం) నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని కంటి సమస్య ఉన్న ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



సరుకులు పరిశీలిస్తున్న తహసీల్దార్

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి శభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని రికార్డులను పరిశీలించి, పిల్లలు, గర్భిణుల, బాలింత వివరాలపై ఆరా తీశారు. కేంద్రానికి వస్తున్న ఐదేళ్ల చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు సక్రమంగా పోషకాహారం ఇవ్వాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఆయాలు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సరిత తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్ నిర్మాణానికి భూమిపూజ



కొబ్బరికాయ కొడుతున్న ఎంపీపీ మల్హర్‌రావు

మల్హర్: మండలంలో చిన్నతూండ్ల ఆరెవాగుపై నిర్మించనున్న చెక్ డ్యామ్ పనులకు ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రూ.2.20 కోట్లతో నిర్మించనున్న డ్యాం పనులను సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిగంటి మమత, ఇరిగేషన్ డీఈ మధుసూదన్ పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మండలంలోని ఆకినపల్లి గ్రామంలో విశారదన్ మహారాజ్ చేపట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రకు సంఘీభావంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్నివర్గాల ప్రజలు పాల్గొని సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు మంద రమేష్ మహారాజ్, మండల అధ్యక్షుడు జన్నే లక్ష్మణ్ మహారాజ్, మండల ప్రధాన కార్యదర్శి దూడపాక రాజు మహారాజ్, దూడపాక శ్రీకృష్ణ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మల్హర్: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాచేర్ల వంశీకృష్ణ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల మండల అధ్యక్షుడు కన్నవేణి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు రాగం విజయ్‌కుమార్, మల్లారం గ్రామ కమిటీ అధ్యక్షుడు కుసుమ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.